# అభివృద్ధి,సంక్షేమం ప్రభుత్వానికి రెండు కండ్లు



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

- కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు లేవు
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- పట్టణంలో 'మన వార్డు.. మన ఎమ్మెల్యే'

రాయికల్, సెప్టెంబర్ 30 : అభివృద్ధి,సంక్షేమం ప్రభుత్వానికి రెండు కండని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. రాయికల్ పట్టణంలోని 10, 9, 1వ వార్డుల్లో శనివారం మన వార్డు.. మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు మహిళలు, ప్రజా ప్రతినిధులు మంగళహారతులు, డబ్బు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ఆయా వార్డుల్లో ఎమ్మెల్యే కాలినడకన తిరుగుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ సర్కార్ పనిచేస్తున్నదన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లేవని చెప్పారు. పట్టణంలోని ఈ మూడు వార్డుల్లో ఇప్పటివరకు రూ.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. మూడు వార్డుల్లో 863 మందికి పెన్షన్లు అందుతున్నాయని, కల్యాణలక్ష్మి పథకం ద్వారా 153 మందికి చెక్కులు అందాయని, గృహ లక్ష్మి ద్వారా 37 మందికి లబ్ధి జరుగుతుందని చెప్పారు.

**సీఎం సహాయ నిధి ద్వారా ఎందరికో మేలు**

సీఎం సహ నిధి ద్వారా ఎంతో మంది పేద ప్రజలకు మేలు జరిగిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణం, మండలానికి చెందిన 72 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 20. 20 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను రాయికల్ పట్టణంలోని వర్తక సంఘంలో శనివారం అందజేశారు. అంతకు ముందు రాయికల్ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు, అల్లీపూర్ ఉప సర్పంచ్ సాగర్‌రావు భార్య స్పందనకు గుండె సంబంధిత శస్త్ర చికిత్స కాగా ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో రైడర్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చింతలూరుకు చెందిన కండ్లపల్లి గంగాధర్ అనే రైతు ఇటీవల గుండెపోటుతో మరణించగా ఆయన భార్య కండ్లపల్లి లక్ష్మికి రైతు బీమా పథకం ద్వారా మంజూరైన రూ. 5 లక్షల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ మోర హనుమాండ్లు, వైస్ చైర్‌పర్సన్ గండ్ర రమాదేవి-అచ్యుతరావు, ఎంపీపీ సంధ్యారాణి -సురేందర్ నాయక్, ఏఎంసీ చైర్‌పర్సన్ రాణి-సాయికుమార్, వైస్ ఎంపీపీ మహేశ్వరరావు, రైతు బంధు సమితి మండల కన్వీనర్ మోహన్‌రావు, పార్టీ ప్రధాన కార్యదర్శి తలారి రాజేశ్, మండల కోఆప్షన్ సభ్యుడు ముఖీద్, ఎంపీటీసీ వైస్ చైర్మన్ బర్కం మల్లేశ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రాయికల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి -వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మహేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు రాజిరెడ్డి, ఉదయశ్రీ, పట్టణ మాజీ అధ్యక్షుడు ప్రసాద్, కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, శ్రీరాముల సువర్ణ-సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ వెంకటి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రొసీడింగ్ అందజేత**

రాయికల్ మండల ఆర్ఎంపీ, పీఎంసీ సంఘం భవన నిర్మాణానికి రూ. 5 లక్షల నిధుల ప్రొసీడింగ్ పత్రాన్ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పట్టణంలోని వర్తక సంఘంలో ఆ కార్యవర్గ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

## మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

జగిత్యాల, సెప్టెంబర్ 30 : మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జగిత్యాల పర్యటన నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో జిల్లా కేంద్రంలోని బీఎల్వీఎన్ గార్డెన్స్, రాయికల్ పట్టణ వర్తక సంఘంలో వేర్వేరుగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకులకు దిశానిర్దేశం చేశారు.

**అభివృద్ధి పనుల పరిశీలన**

తెలంగాణ రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జగిత్యాలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఈ నెల 3న రానున్నారు. ఈ నేపథ్యంలో డబుల్‌బెడ్రూం ఇండ్ల సమీకృత మార్కెట్, వివేకానంద మినీ స్టేడియం, నూతన ఎస్పీ కార్యాలయం ప్రాంతాలను శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పరిశీలించారు. ఇక్కడ రాష్ట్ర టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ,మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ నాయకులు ఉన్నారు.

**కులవృత్తులకు ప్రోత్సాహం**

రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల ప్రోత్సాహాన్నిస్తున్నదని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్వర్ణకార సంఘంలో ఎస్డీఎఫ్ నిధులు



పనులను పరిశీలించి నాయకులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రూ. 10 లక్షలతో అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీ దుర్గాభవాని సేవా సమితి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి తెలంగాణ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కుల వృత్తులు నిర్వీర్యం కాగా, నేడు ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వలసలు పెరిగాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులను గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు ప్రవీణ్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ అనిల్, డీఈ రాజేశ్వర్, నాయకులు సత్యం, గిరి, రంగు రాజయ్య, స్వర్ణకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం

కొడిమ్యాల, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలో రెడ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో శనివారం వినాయక నిమజ్జనం చేశారు. అంతకుముందు వినాయక మండపం వద్ద వాషింగ్ మిషన్, మొబైల్, రిఫ్రిజిరేటర్, వాటర్ ప్యూరిఫైర్, గ్యాస్‌స్టవ్ , రైస్ కుక్కర్‌కు డ్రాతీయగా గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీపూర్‌లో**

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 30 : మండలంలోని లక్ష్మీపూర్‌లో రెడ్డి యూత్ వినాయక మండపంలోని గణనాథుడిని శనివారం నిమజ్జనం చేశారు. అంతకుముందు పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి యువకులు నృత్యాలతో హోరెత్తించారు. కార్యకరమంలో రెడ్డి యూత్ నాయకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు

## డిగ్రీ కళాశాలలో 'శ్రమదానం'

మెట్‌పల్లి, సెప్టెంబర్30: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీవాణి ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్త, చెదారం తొలగించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటిని నీటి తడి అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకయ్య, ఉపన్యాసకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**కళాశాలలో స్వచ్ఛతా హి సేవా**

కొడిమ్యాల, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పిచ్చి మొక్కలు, వ్యర్థ పదార్థాలు తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం**

జగిత్యాల టవర్ సర్కిల్, సెప్టెంబర్ 30 స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం శ్రమదానం నిర్వహించారు. విద్యార్థినులు కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించి, పరిసరాలను శుభ్రపరిచారు. పరిసరాల పరిశుభ్రత తోనే వ్యాధులను దూరం చేసుకోవచ్చని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు అంతర్గాం విద్యార్థిని



శివరాత్రి

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 30 : సెప్టెంబర్ 20 నుంచి 26 వరకు జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్ 17 బాలికల ఖోఖో విభాగంలో జిల్లా జట్టుకు శివరాత్రి (10వ తరగతి) విద్యార్థి ఎంపికైందని పీఈటీ అజయ్‌బాబు శనివారం తెలిపారు. ఈ విద్యార్థి ఈ నెల 4న కొడిమ్యాలలో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో జగిత్యాల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. విద్యార్థినిని పాఠశాల హెచ్ఎం సత్తయ్య, సర్పంచ్ నారాయణ, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గొల్లపల్లి, సెప్టెంబర్ 30: గొల్లపల్లి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ దామోదర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లపల్లి మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా విద్యుత్ స్తంభాలను తొలగించడం కోసం విద్యుత్ కోత విధిస్తున్నట్లు వివరించారు. గొల్లపల్లి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గొల్లపల్లి, గొల్లపల్లి ఎక్స్‌ప్రెస్ ఫీడర్లతో పాటు గుంజపడుగు, రాఘవపట్నం ఫీడర్లకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని చెప్పారు. రైతులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వరిలో కలుపు మొక్కలపై సర్వే

కొడిమ్యాల, సెప్టెంబర్ 30 : పూడూర్‌లో శనివారం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు వరిలో కలుపు తీసే మొక్కలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హైదరాబాద్ అఖిల భారత సమన్వయ కలుపు యాజమాన్య కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ, కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్ వరిలో కలుపు తీసే మొక్కలను పరిశీలించి, రైతులు వాడుతున్న మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన సమయంలో మందు పిచికారీ చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు బంధు కాలేజ్ కో ఆర్డినేటర్ కుంబం శ్రీనివాస్, రవి, మల్లారెడ్డి, ఏఈవో శ్రీలత, రైతులు పెద్ది రవికుమార్, వెల్మల రాంరెడ్డి పాల్గొన్నారు.

## జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి

జగిత్యాల, సెప్టెంబర్ 30 : అసంక్రమిత వ్యాధులను అరికట్టడానికి జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ తేజ్ కిరణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో శనివారం అసంక్రమిత వ్యాధుల ఇన్‌చార్జి వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు అసంక్రమిత వ్యాధుల పునర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులను తొందరగా గుర్తించడం ద్వారా సరైన సమయంలో సరైన చికిత్స అందించే అవకాశం ఉంటుందన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ ఎండీ సమీయొద్దీన్ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల చికిత్స తీసుకున్న వారి పూర్తి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేసి వారి ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుప్పాల శ్రీధర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అసంక్రమిత వ్యాధుల క్యాంపు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్‌రెడ్డి, జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి స్వామి, ఎన్‌సీడీ జిల్లా సూపర్‌వైజర్ మురళీధర్, శ్యామ్ సిబ్బంది హాజరయ్యారు.

## తపాలా కార్యాలయ సిబ్బంది ర్యాలీ

జగిత్యాల, సెప్టెంబర్ 30 : దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మేరీ మట్టి- మేరీ దేశ్ కార్యక్రమాన్ని జిల్లా తపాలా శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శనిఆరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని తపాలా సిబ్బంది ప్రధాన తపాలా కార్యాలయం నుంచి టవర్ సర్కిల్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

## శతాధిక వృద్ధుడు మృతి

పెగడపల్లి, సెప్టెంబర్ 30: ల్యాగలమర్రికి చెందిన నీలి పోచయ్య (110)అనే శతాధిక వృద్ధుడు శనివారం మృతి చెందాడు. పోచయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు సంతానం కాగా ఆరుగురు మనవళ్లు, ఆరుగురు మనవరాళ్లు, 8 మంది మునిమనవళ్లు, ఆరుగురు మునిమనువరాళ్లు మొత్తం 36 మంది కుటుంబసభ్యులు ఉన్నారు. ఆయన భార్య నర్సమ్మ 50 సంవత్సరాల క్రితమే మృతి చెందారు.

## పిడుగుపాటుకు లేగదూడ మృతి

సారంగాపూర్, సెప్టెంబర్ 30: మండలంలోని పెంబట్లలో తేలు గంగాధర్‌కు చెందిన లేగదూడ పిడుగుపాటుకు మృతి చెందింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడడంతో దూడ మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరాడు.